మొలకెత్తని పత్తి విత్తనాలు

- వర్షాభావమే కారణం
- వడలిపోతున్న అరకొర వచ్చిన మొక్కలు
- పొలాలను దున్నేస్తున్న రైతులు
- బెట్ట వాతావరణంపై రైతుల ఆందోళన


పొలంలో పత్తి మొక్కలు తీసేసి తిరిగి అచ్చు తోలుతున్న రైతు


పత్తి మొక్కలు పీకేసి తిరిగి మొక్క వేసేందుకు సిద్ధం చేసిన పొలం

పెనుగంచిప్రోలు: ఈఏడాది ఏప్రిల్, మే నెలల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఇప్పుడు తొలకరి పలకరించాక వరుణ దేవుడు ముఖం చాటేస్తున్నాడు. దుక్కులు దున్ని విత్తనం వేసేందుకు రైతన్న ఎదురుచూస్తున్నాడు. ఏరోజుకు ఆరోజు ఈరోజైనా వాన పడకపోతుందా? అంటూ రైతన్న ఆకాశంవైపు ఆశగా ఎదురుచూస్తున్నాడు. జూన్ నెల చివరకు వచ్చినా వడగాలులతోపాటు ఎండలు మండుతున్నాయి. వర్షాల కోసం రైతులు గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు.

ఎండుతున్న మొక్కలు....

మే నెలలో కురిసిన వర్షాలకు కొంతమంది రైతులు పొలంలో పత్తి విత్తనాలు విత్తారు. సుబాబుల్ సాగు చేపట్టిన రైతులు కూడా విత్తనాలు నాటారు. మరి కొంతమంది రైతులు అచ్చుసాళ్ల తోలి పొలాలను సిద్ధం చేసి విత్తనాలు విత్తేందుకు రోజూ ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. వడగాలులు, ఎండలకు విత్తిన పత్తి విత్తనాలు చాలావరకు మొలవక పోగా మొలిచినవి వడలిపోయి ఎండిపోతున్నాయి. దీంతో రైతులు మొక్కలను రోటావేటర్‌తో దున్నించి మళ్లీ అచ్చుతోలి విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఈఏడాది రైతులకు ఆదిలోనే అదనపు ఖర్చు అయ్యిందని రైతులు వాపోతున్నారు. వాతావరణ శాఖ ప్రకటించిన ప్రకారం 25శాతం అధికంగా వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసినా, ఈప్రాంతంలో సరైన వర్షాలు లేక రైతులు పంటలు ఎండి పోతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన మిర్చి సాగు..

జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో 40శాతం మందికిపైగా రైతులు ఇప్పటికే పత్తి, మొక్కజొన్న, మినుము, పెసర విత్తనాల సాగు చేపట్టారు. గతేడాది మిర్చికి ధర లేకపోవడం, దిగుబడులు తగ్గడం, ఆపంట ఇంకా కోల్డ్ స్టోరేజీల్లోనే నిల్వ ఉండటంతో ఈఏడాది మిరప సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. దాదాపు 60శాతం మందికి పైగా రైతులు మిర్చి సాగును నిలిపి వేశారు. మిర్చి సాగు స్థానంలో పత్తి, సుబాబులు, మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపారు. రైతులు సుబాబులు విత్తనాలతోపాటు నర్సరీల్లో పెరిగిన మొక్కలు తెచ్చి మరీ నాటారు. అయినా వర్షాలు కురవకపోవడంతోపాటు ప్రస్తుతం ఉన్న బెట్ట వాతావరణం రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది.

ఆదిలోనే రూ.40 వేలు నష్టపోయాం..



మే నెలలో కురిసిన వర్షంతో ముందుగా పదెకరాల్లో పత్తి విత్తనాలు నాటాను. జూన్ నెల మొదలైన నాటి నుంచి వడగాలులు, ఎండలకు మొక్కలు మొలవలేదు. మొలిచిన అరకొర మొక్కలు కూడా ఎండిపోతున్నాయి. దీంతో పొలం మొత్తం రోటావేటర్‌తో దున్నించి, మళ్లీ ట్రాక్టర్‌తో మొక్కలు వేసేందుకు అచ్చు తోలిస్తున్నాం. సాగు మొదలుగాక ముందు రూ.40 వేలు నష్టపోయాం.

–దురిశాల గోపి, రైతు, పెనుగంచిప్రోలు

వడలి పోతున్నాయి..



వడగాలులు, తీవ్రమైన ఎండలకు పత్తి మొక్కలతోపాటు సుబాబులు మొక్కలు కూడా ఎండి పోతున్నాయి. మరోవారం ఇలాగే ఉంటే మొక్కలు పూర్తిగా ఎండి పోతాయి. మళ్లీ విత్తనాలు వేయాలంటే ఎకరానికి రూ.8వేల నుంచి రూ.10 వేలు ఖర్చు తప్పేలా లేదు. ఈసారి ఖరీఫ్ సీజన్ ఆరంభమే ఇలా ఉంటే, సాగుకాలం పూర్తయ్యేలోగా ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ఆందోళనగా ఉంది.

– కాకాని శివప్రసాద్, రైతు, పెనుగంచిప్రోలు

క్లుప్తంగా

మంచినీటి ట్యాంకర్ ప్రారంభం



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ యీవూరి రవీంద్రారెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకర్‌ను వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ రవీంద్రరెడ్డి సేవానిరతిని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, మండలపార్టీ అధ్యక్షుడు పాస్నం కోటేశ్వరరావు, గ్రామాధ్యక్షుడు ఎస్.మధుసూధన రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, శ్రీకనకదుర్గమ్మవారి ఆలయ మాజీ డైరక్టర్ నంబూరి రవి, నాయకులు నారాయణరెడ్డి, మన్నె అప్పారావు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ



గోపినేనిపాలెం(వత్సవాయి): మండలంలోని గోపినేనిపాలెంలో సోమవారం జయప్రద ఫౌండేషన్ కంటి వైద్యశిబిరం నిర్వహణలో భాగంగా 60మందికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ మాట్లాడుతూ జయప్రద ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 2వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 760 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. 140 మందికి విజయవాడ శంకర్ నేత్రాలయంలో ఆపరేషన్లను చేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు వల్లమూడి రాంబాబు, కోఆర్డినేటర్ కట్టా వెంకటనరసింహారావు, మేకా వెంకటేశ్వర్లు, కామినేని కిషోర్, గింజుపల్లి వీరబాబు, అలసకాని నవీన్, పాస్నం పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు ఘనసత్కారం



కంచికచర్ల: మండల నూతన తహశీల్దార్ ఎస్. నరసింహారావును పీడీఎస్ డీటీ సుమతి, డీలర్ల సంఘ అధ్యక్షుడు కావాటి ఆదినారాయణ ఆధ్వర్యంలో డీలర్ల సంఘ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం తహశీల్దార్ నరసింహారావు మాట్లాడుతూ రేషన్ కార్డుదారులందరికీ సమయపాలన పాటించి రేషన్ సరుకులు ఇవ్వాలని, దివ్యాంగులు, వృద్ధులకు మాత్రం వారి ఇంటివద్దకు సరుకులు తీసుకువెళ్లి ఇవ్వాలని సూచించారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని డీలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘ నాయకులు మార్కపూడి మధుబాబు, సంగీత బాలస్వామి, వేముల నాగరాజు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘననివాళి



నందిగామరూరల్: స్థానిక బీజేపీ కార్యాలయంలో జనసంఘ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తొర్లికొండ సీతారామయ్య, నాయకులు బండారు కేదార్‌నాథ్, మునగంటి కామేశ్వరరావు, కేతేపల్లి ప్రసాద్, ఊటుకూరు సత్యనారాయణ గుప్త, పులిపాటి లక్ష్మణరావు, కార్యకర్తలు ఉన్నారు.

కంప్యూటర్ ఏర్పాటు

నందిగామరూరల్:మండలంలోని మునగచర్ల గ్రామంలోని సచివాలయంలో పంచాయతీ నిధులు రూ.50 వేలతో కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన కంప్యూటర్, ప్రింటర్‌ను సోమవారం ఎంపీడీవో శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంగలూరి వెంకట నర్సయ్య, నాయకులు వీరంకి వీరాస్వామి, కొల్లూరు నాగేశ్వరరావు, వెంకట్రావు, ప్రసాద్, నాగేశ్వరరావు, చిట్టెమ్మ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రథయాత్ర


సత్యసాయి ప్రేమవాహని రథయాత్రకు స్వాగతం పలుకుతున్న విప్, ఎమ్మెల్యే సౌమ్య


పేటలో మహిళల కోలాట నృత్యం

నందిగామటౌన్:పట్టణంలో సత్యసాయి ప్రేమ వాహిని రథయాత్ర సోమవారం కనులపండువగా సాగింది. సత్యసాయిబాబా 100వ జయంతి సందర్భంగా 'అందరిని ప్రేమించు.. అందరిని సేవించు' అనే దివ్యసందేశాన్ని ప్రజలకు అందించాలనే సత్సంకల్పంతో చేపట్టిన ప్రేమవాహిని రథయాత్రకు భక్తులు స్వాగతం పలికారు. స్థానిక సీఎం రోడ్డులోని బాబా ఆలయం నుంచి పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయం, గాంధీ సెంటరు మీదుగా పాత బస్టాండ్, అనాసాగరం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అక్కడి నుంచి రథయాత్ర జగ్గయ్యపేటకు తరలివెళ్లింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య రథయాత్రకు స్వాగతం పలికి పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, పలువురు నాయకులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: భగవాన్ శ్రీసత్యసాయి శత జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సత్యసాయి రథయాత్ర సోమవారం జగ్గయ్యపేట పట్టణానికి చేరుకుంది. జగ్గయ్యపేటకు చేరుకున్న రథయాత్రకు స్థానిక శ్రీసత్యసాయి సేవాసమితి భక్త బృందం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిల్లకల్లు రోడ్‌లోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద నుంచి భక్త బృందం కన్వీనర్ చిట్టూరి కొండ దంపతుల ఆధ్వర్యంలో రథయాత్రకు పూర్ణకుంభంతో భక్తులు స్వాగతం పలికారు. మహిళా కోలాట బృందం నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పట్టణ సీఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐ జి.రాజు పర్యవేక్షణలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

కొనసాగుతున్న సచివాలయ ఉద్యోగుల నిరసన


డీటీ రాధికకు వినతిపత్రం అందజేస్తున్న జగ్గయ్యపేట పట్టణ సచివాలయాల ఉద్యోగులు

జగ్గయ్యపేటఅర్బన్: జీవో నంబరు 5ను సవరించి పట్టణాల్లో సొంత ఊరు కాకుండా సచివాలయం టూ సచివాలయం బదిలీకి అవకాశం కల్పించాలని సచివాలయాల ఉద్యోగులు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలోని సచివాలయ ఉద్యోగులంతా మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలోని డీటీ రాధికకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీలకు సంబంధించి సొంతమండలంలో పోస్టింగ్ ఇవ్వరాదనే నిబంధన పెట్టడం తగదన్నారు. ప్రభుత్వంలో పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసే ఏ ఉద్యోగికి లేని ఇటువంటి నిబంధనలను తమలాంటి చిరు ఉద్యోగులపై రుద్దడం పిచ్చుకపై బ్రహ్మాస్త్రం మాదిరిగా ఉందని విమర్శించారు. కావున ప్రభుత్వం వెంటనే జీవోనంబర్ 5ను సవరించి పట్టణాల్లో సచివాలయం నుంచి సచివాలయానికి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 14 సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఐక్యతా సమావేశం


ఐక్యతా సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

నందిగామటౌన్: క్రైస్తవ సమాజం, రాజ్యాంగం మాత్రమే క్రైస్తవ సమాజానికి రక్షణ కవచాలని ఐఆర్ఈయఫ్ డైరెక్టర్ ఇమ్మాన్యుయేల్ రెబ్బా పేర్కొన్నారు. పట్టణంలోని పాత బైపాస్ రోడ్డులోని హజరయ్య ప్రాంగణంలో సోమవారం నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పాస్టర్ల ఐక్యతా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్లను చైతన్యపరిచి రాజ్యాంగం, హక్కులపై అవగాహన కలిగించాలనే ధ్యేయంతో సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు. ముఖ్యంగా క్రైస్తవులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవటంతోపాటు హక్కులను సాధించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంటిలెక్చువల్ ఫోరం ప్రతినిధి కెజడ్ఎస్ కుమార్, హైకోర్టు న్యాయవాది సలికేటి దేవకుమార్, రెవ. మార్కపూడి డేవిడ్, పెద్ద సంఖ్యలో పాస్టర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: సీఎంఆర్ఎఫ్ కింద పలువురికి మంజూరైన నగదు చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోమవారం తన కార్యాలయంలో పంపిణీ చేశారు. అనుమంచిపల్లి గ్రామానికి చెందిన నిగిడాల నరసింహారావు, జగ్గయ్యపేటకు చెందిన కూర్మాల రాధాకృష్ణ, జిడుగు లక్ష్మీపతికి మంజూరైన రూ.3.01లక్షల విలువగల చెక్కులను వారి కుటుంబసభ్యులకు అందజేశారు. టీడీపీ నాయకుడు శ్రీరాం చినబాబు, అనుమంచిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ యానాల గోపీచంద్, నాయకులు ముత్తినేని అశోక్, కట్టా నవీన్ పాల్గొన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు:మండలంలోని ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు సూచించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మండలంలోని వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. వీఆర్వోలు గ్రామాల్లోని రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలను గుర్తించడంతోపాటు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆలయం చుట్టూ విద్యుద్దీపాలు ఏర్పాటు


క్రేన్ సాయంతో సాగుతున్న విద్యుత్‌స్తంభాల ఏర్పాటు పనులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలు లేకపోవడంతో భక్తులు రాత్రివేళల్లో ఇబ్బందులుపడుతున్నారు. అమ్మవారి దర్శనానికి శుక్ర, ఆదివారాల్లో అమ్మవారిని దర్శించుకునే భక్తుల్లో పలువురు ముందురోజు రాత్రి ఆలయం వద్దకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో విద్యుద్దీపాలు లేక చీకటి కారణంగా భక్తులపై కుక్కలు దాడులు చేస్తుండటంతోపాటు పలుమార్లు దొంగతనాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు ఆలయం చుట్టూ రూ.37లక్షలతో విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ రథం తిరిగేందుకు ఇబ్బంది లేకుండా స్తంభాలకు అండర్ గ్రౌండ్ వైరింగ్ ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ 24 విద్యుత్ స్తంభాలతో పాటు, మునేరు అవతల అమ్మవారి మామిడితోటలో ఒకదానిలో 18, మరో తోటలో 8 స్తంభాలు ఏర్పాటు చేశారు. మొత్తం 50 విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. లైటింగ్ ఏర్పాటుకు నాలుగు ఫీడర్ బాక్సులు అవసరం కాగా, అవి కూడా రెండు రోజుల్లో వస్తాయని ఆలయ విద్యుత్ ఏఈ అరవింద్ తెలిపారు. మొత్తం మీద ఆలయం వద్ద విద్యుద్దీపాల ఏర్పాటు చేయడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి తీరుతో పేదలకు నష్టం : సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

నందిగామరూరల్: కూటమి ప్రభుత్వం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేసి నిరుపేద విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవి కృష్ణ విమర్శించారు. పట్టణంలోని సుందరయ్యభవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాఠశాలలను తొలగిస్తూ విద్యా వ్యవస్థ వినాశనానికి పాల్పడుతోందన్నారు. విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, తద్వారా డ్రాపౌట్స్ సంఖ్య పెరుగుతుందని మండిపడ్డారు. పాఠశాలల రద్దు కారణంగా కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలంటే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. దీంతో పేదలు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ కొరవడిందని, ఫీజుల పేరుతో వేలకు వేలు దోచుకుంటున్నా మౌనం వహిస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రద్దు చేసిన ప్రాథమికోన్నత పాఠశాలలను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పీవీ ఆంజనేయులు, కర్రి వెంకటేశ్వరరావు, గోపీనాయక్, రవిశేఖర్, శ్రీనివాసరావు, హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

వాగుపై ఆక్రమణల తొలగింపునకు వినతి


ఎన్నెస్పీ, కాచేటి వాగులపై ఆక్రమణలు తొలగించాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కంచికచర్ల : మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాల సమీపంలో ఉన్న ఎన్నెస్పీ కాల్వ, కాచేటి వాగులపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని కోరుతూ తహశీల్దార్ నరసింహారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రైతులు మాట్లాడుతూ ఈ వాగుభూములను కొంతమంది ఆక్రమించుకుని రోడ్లు వేశారని, ఆ రోడ్లను తొలగించి పొలాలకు సాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వేనంబర్లు 317, 326, 327లలో ఉన్న ప్రధాన కాచేటి వాగు, ఎన్నెస్పీలను పూడ్చివేసి రోడ్లు వేసుకుని వ్యాపారం చేస్తున్నారన్నారు. దీంతో సమీపంలోని పంట పొలాలకు సాగునీరు రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకనైనా తగిన చర్యలు తీసుకుని తమ భూములకు సాగునీరు అందేలా చూడాలని తహశీల్దార్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు బోడేపూడి వెంకటరామారావు, ఆకుల నరసింహారావు, బండ్ల నాగేశ్వరరావు, ఉప్పులూరి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మండలంలో నాలుగు ఆధార్ కేంద్రాలు

నందిగామ రూరల్: మండలంలోని జొన్నలగడ్డ, లింగాలపాడు సచివాలయాలతోపాటు పట్టణంలోని ఇండియన్ బ్యాంక్, తపాలా శాఖ కార్యాలయంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు తహశీల్దార్ సురేష్‌బాబు సోమవారం తెలిపారు. ఆయా ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పీజీఆర్ఎస్‌కు 13 అర్జీలు

నందిగామరూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 13 అర్జీలు అందినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి తొమ్మిది, సర్వే కోసం ఒకటి, విద్యుత్‌శాఖ రెండు, పోలీస్ శాఖకు సంబంధించి ఒక అర్జీ వచ్చిందని తెలిపారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించడంతోపాటు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని వివరించారు.

ఆలయాల అభివృద్ధి కోరుతూ మంత్రికి వినతి



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో దేవాలయాలను అభివృద్ధి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే తాతయ్య సోమవారం విజయవాడలో మంత్రిని కలిశారు. టెంపుల్ టూరిజం, కేంద్ర ప్రభుత్వ ప్రసాదం స్కీముల ద్వారా పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, తిరుమలగిరి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, ముక్త్యాల శ్రీకోటిలింగ హరిహర మహాక్షేత్రం, వేదాద్రిలోని శ్రీయోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలను అభివృద్ధి చేయాలని మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తాతయ్య వివరించారు.

పేకాట శిబిరాలపై దాడి

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలు మునేరు అవతల మామిడి తోటల్లో సాగుతున్న పేకాట శిబిరాలపై పోలీసులు సోమవారం దాడిచేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ మాట్లాడుతూ మునేరు అవతల వెంకటప్పయ్య గార్డెన్‌లో, అనిగండ్లపాడు రోడ్డులో మునేరు పక్కన తమసిబ్బందితో దాడిచేసి పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.34 వేల నగదు, నాలుగు బైక్‌లు స్వాధీనం చే సుకున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో వత్సవాయి ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలగక ఇబ్బందులు



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 22వ వార్డు నాగమయ్య గుడి, మసీదు రోడ్డులోని మఠం శివాలయం రోడ్డులోని వీధిలైట్లు గత 20 రోజులుగా వెలగకపోతుండటంతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. సంబంధిత సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా మున్సిపాలిటీలోని విద్యుత్ విభాగం అధికారులు స్పందించి వెంటనే వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.